నమస్తే తెలంగాణ

# హనుమకొండ

5 | వరంగల్, గురువారం 13 ఫిబ్రవరి 2025 | HANUMAKONDA






సమ్మక్క గుడి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న పూజారులు

గుడి ముందు ముగ్గులు వేస్తున్న పూజారుల కుటుంబ సభ్యులు



**గిరిజన సంస్కృతీ సంప్రదాయాలకు** అద్దంపట్టే మేడారం మినీ జాతర ప్రారంభమైంది. కోరిన కోర్కెలు తీర్చుతూ భక్తుల కొంగు బంగారంగా కొలువబడే సమ్మక్క, సారలమ్మను దర్శించుకునేందుకు భక్తుల రాక మొదలైంది. ఆసియాలోనే రెండో అతి పెద్దది.. తెలంగాణ కుంభమేళాగా పిలువబడే మేడారం మహాజాతర ప్రతీ రెండేళ్లకోసారి కోట్లాది మంది భక్తులతో అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఇది ముగిసిన ఏడాది తర్వాత జరుపుకొనే మినీ జాతర బుధవారం అమ్మవార్ల ప్రధాన పూజారుల ప్రత్యేక పూజలు, మండెమెలిగే కార్యక్రమంతో మొదలు కాగా.. తన్మయత్వంతో భక్తులు తరలి వచ్చి తల్లులకు బంగారం మొక్కులు సమర్పిస్తున్నారు. కాగా, ఈ జాతర శనివారం వరకు కొనసాగనున్నది.

- తాడ్వాయి, ఫిబ్రవరి 12



అమ్మవార్ల దర్శనం కోసం క్యూలో వస్తున్న భక్తులు

ప్రారంభమైన మేడారం మినీ జాతర

# వనదేవతలకు వరాల మొక్కులు

- అంగరంగ వైభవంగా మండెమెలిగే పండుగ
- సమ్మక్క, సారలమ్మ మందిరాల్లో సిద్ధబోయిన, కాక వంశీయుల పూజలు
- అమ్మవార్ల దర్శనానికి తరలివస్తున్న భక్తులు
- తల్లులకు ప్రణమిల్లి ఎత్తు బంగారం సమర్పిస్తున్న ప్రజలు
- రద్దీగా మారుతున్న జంపన్న వాగు, గద్దెల ప్రాంతాలు

మేడారం సమ్మక్క, సారలమ్మల మినీ జాతర బుధవారం ప్రారంభమైంది. ఆదివాసీ గిరిజన దైవాలకు పూజారులు అత్యంత నియమనిష్టలతో పూజలు నిర్వహించి మండెమెలిగే పండుగను నిర్వహించడంతో జాతర మొదలైంది. మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని మేడారంలోని సమ్మక్క పూజామందిరంలో సిద్ధబోయిన వంశస్తులు, కన్నెపల్లిలోని సారలమ్మ మందిరంలో కాక వంశీయులు ప్రత్యేక పూజలు చేశారు. మొదట అమ్మవార్ల మందిరాలను సిద్ధబోయిన, కాక వంశీయులు నీటితో శుద్ధి చేశారు. గత మహాజాతర అనంతరం భద్రపరిచిన సమ్మక్క, సారలమ్మల పూజా సామగ్రిని ప్రధాన పూజారులు కొక్కెర కృష్ణయ్య, కాక సారయ్య బయటకు తీసి పూజా కార్యక్రమాలకు సిద్ధం చేశారు. పూజారి సిద్ధబోయిన లక్ష్మణ్‌రావు ఇంటి నుంచి మామిడి తోరణాలు, పసుపు, కుంకుమతో పాటు పూజా సామగ్రిని తీసుకొని డోలివాయిద్యాల నడుమ గ్రామ శివారులోని పోచమ్మ ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి బొడ్రాయి వద్దకు చేరుకొని ప్రతిమలను శుద్ధి చేసి పూజలు నిర్వహించారు. గ్రామంలోకి ఎలాంటి దుష్టశక్తులు రాకుండా ఉండేందుకు ఊరి ప్రారంభంలో, తల్లుల గద్దెల ఎదురుగా మామిడి తోరణాలతో పాటు కోడిపిల్లను కట్టి ధ్వజ స్తంభాలను ఏర్పాటు చేశారు. ఊరట్టంలోని చర్ప వంశీయులు, కీర్తిశేషులు మాజీ ఎమ్మెల్యే భోజారావు కుటుంబ సభ్యులు, వారి కూతుళ్లు, అల్లుళ్లు కలిసి చలపెయ్యను బహూకరించగా సిద్ధబోయిన వంశస్తులు స్వీకరించి డోలివాయిద్యాల నడుమ గద్దెల వద్దకు తీసుకొచ్చి పూజలు చేశారు. అనంతరం అమ్మవార్ల మందిరాల్లో సిద్ధబోయిన, కాక వంశీయులు ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. నాలుగు రోజుల పాటు అమ్మవార్లకు పూజారులు, వారి కుటుంబాలు పూజలు నిర్వహించనున్నారు.



తల్లుల గద్దెల వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



జంపన్న వాగు వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు

## తన్మయత్వంతో తల్లుల చెంతకు..

కోరిన కోర్కెలు తీర్చాలంటూ వరాల తల్లు లు మేడారం సమ్మక్క-సారలమ్మల చెంతకు భక్తులు తన్మయత్వంతో చేరుకుంటున్నారు. బుధవారం మినీ జాతర ప్రారంభం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి ఎత్తు బంగారం (బెల్లం) సమర్పిస్తూ తమ పిల్లా పాపలను చల్లగా చూడాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని అమ్మవార్లను వేడుకుంటూ మొక్కులు చెల్లించుకుంటున్నారు. భక్తులు జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరిస్తూ జంపన్న, నాగులమ్మకు పూజలు చేసిన అనంతరం గద్దెల వద్దకు చేరుకొని తల్లులను దర్శించుకుంటున్నారు. దీంతో గద్దెల పరిసరాలు కిక్కిరిసిపోతున్నాయి. భక్తులు తల్లులకు యాటపోతులు సమర్పిస్తూ జాతర ప్రాంగణం, అటవీ ప్రాంతంలో వంటలు చేసుకొని విందు భోజనాలు ఆరగిస్తున్నారు. మహాజాతరకు మళ్లీ వచ్చి మొక్కులు చెల్లించుకుంటామని వెనుదిరుగుతున్నారు.

## తగ్గిన భక్తుల రాక

ములుగు, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): బుధవారం ప్రారంభమైన మినీ జాతరకు భక్తులు తక్కువ సంఖ్యలో హాజరయ్యారు. జాతర ప్రా రంభమయ్యే ముందు రోజు లక్షలాది భక్తులు మేడారం పరిసర ప్రాంతాలకు చేరుకొని గుడారాలు వేసుకుంటారు. కానీ ఈ సారి అవి కనిపించలేదు. గత మినీ జాతర సందర్భంగా సు మారు 10 లక్షల మంది వరకు భక్తులు రాగా, ఇప్పుడు 20 నుంచి 30 వేల మంది మాత్రమే వచ్చారు. జాతర మొదటి రోజు సుమారు 20 లక్షల మంది వరకు వస్తారని అధికారులు వేసిన అంచనా తప్పింది. ప్రభుత్వం ఆర్టీసీ బ స్సుల ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించినప్పటికీ వారు జాతరకు వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం ఆర్టీసీ ప్రాంగణం భక్తులు లేక వెలవెలబోతున్నది. జాతర సమయంలో రద్దీ ఉంటుందని నెల రోజుల ముందు నుంచే వచ్చిపోతుండడం, ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళాకు అధిక సంఖ్యలో ప్రజలు తరలివెళ్తుండడం వల్లే భక్తుల రాక తగ్గినట్లు అంచనావేస్తున్నారు. కాగా, మినీ జాతర అరకొర సౌకర్యాల మధ్య కొనసాగుతున్నది. జంపన్నవాగులో చుక్క నీరు లేక భక్తులంతా స్నానఘట్టాల వద్ద ఉన్న నల్లాల కిందనే స్నానాలాచరించారు. వైద్య శిబిరంలో కేవలం వైద్య సిబ్బంది మాత్రమే మందులను పంపిణీ చేశారు. జాతర పరిసరాల్లో తాత్కాలిక మరుగుదొడ్లు కనిపించలేదు.

## నేడు జనగామకు ఎమ్మెల్సీ కవిత రాక



జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 12 : ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గురువారం జనగామ జిల్లాకేంద్రానికి రానున్నారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో మధ్యాహ్నం 12గంటలకు జరిగే విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కవిత పాల్గొననున్నారు. ఎమ్మెల్యే పల్లా ప్రస్తుతం తీవ్రమైన వెన్నునొప్పి కారణంగా ఈ సమావేశానికి హాజరుకాలేకపోతున్నారని క్యాంప్ కార్యాలయ సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు.



పెద్దవంగర: మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు, పక్కన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు

# స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ఖతం

## త్వరలో రేవంత్ పాలనపై రైతుల తిరుగుబాటు తప్పదు

- బ్రోకర్ మాటలతో అధికారంలోకి కాంగ్రెస్
- పనులు శూన్యం.. పేర్ల మార్పుతో ఆనందం
- మళ్లీ ఎన్నికలొస్తే బీఆర్‌ఎస్‌కు 100 సీట్లు ఖాయం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తాచాటాలి : మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

పాలకుర్తి/ పెద్దవంగర, ఫిబ్రవరి 12 : త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని, ఈ ఎన్నికలతో ఆ పార్టీ ఖతమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బ్రోకర్ మాటలతో అధికారం చేపట్టిన రేవంత్‌రెడ్డి 15 నెలల పాలనలో దేవుళ్లపై ఒట్లు.. తేదీలు, పేర్ల మార్పులు తప్ప చేసిన అభివృద్ధి శూన్యమని.. ఆరు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కుప్పకూలడం ఖాయమన్నారు. బుధవారం పెద్దవంగర మండలకేంద్రంలో నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి బీఆర్‌ఎస్ నాయకులతో సమీక్ష, పాలకుర్తిలోని పార్టీ కార్యాలయంలో చేరికల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ హామీల అమలులో రేవంత్‌రెడ్డి విఫలమయ్యారన్నారు. స్థానిక ఎన్నికల కోసమే రైతు భరోసా వేస్తున్నారన్నారని ఆ తర్వాత భరోసాకు రాంరాం చెబుతారని ఎర్రబెల్లి విమర్శించారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని పాడిపంటలతో సస్యశ్యామలమై రైతులంతా సంతోషంగా ఉన్నారన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక హైడ్రా, మూసీ పేరుతో హైదరాబాద్ అల్లోకల్లోలమవుతున్నదన్నారు. మరో 15 రోజుల్లో రైతాంగం సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై తిరుగబడతారని చెప్పారు. గోదావరి జలాలు రాక చెరువులు, కుంటలు నిండక నీళ్లులేక పంట పొలాలు ఎండిపోతున్నాయని రైతులు కన్నీళ్లు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యేలకు సఖ్యత లేదని.. అధిష్టానం ఓ తీరు.. రాష్ట్రంలో మరో తీరు ఉండడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితిలో కాంగ్రెస్ నెలకొన్నదని మళ్లీ ఎన్నికలు వస్తే రాష్ట్రంలో మళ్లీ కేసీఆరే సీఎం కావడంతో పాటు ఎమ్మెల్యేలు 100 సీట్లు రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, ఆసరా పెన్షన్లు, కౌలు రైతులకు ఇచ్చిన హామీలేవీ అమలుచేయకుండా అన్నీ పూర్తి చేశామని ప్రకటనలు చేయడం సిగ్గుచేటన్నారు. సమన్వయం లేక ఇప్పటికీ మంత్రివర్గ విస్తరణ చేయలేదని.. రేవంత్‌రెడ్డికి సమాచారం లేకుండానే వరంగల్ పర్యటనకు వస్తానని రాహుల్ గాంధీ ప్రకటించి.. అంతలోనే మార్చుకోవడంలోనే అర్థమవుతున్నదన్నారు. తొర్రూరును డివిజన్ కేంద్రం చేసి, 100 పడకల దవాఖాన చేస్తే ఇప్పటికీ అభివృద్ధి లేదన్నారు. పాలకుర్తి నియోజకవర్గాన్ని అద్దంలా తీర్చిదిద్దానని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలోని ఆరు జడ్పీటీసీలు బీఆర్‌ఎస్‌కే రావడం ఖాయమని.. ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త సంస్థల ఎన్నికల్లో సమన్వయంతో పనిచేయాలని.. ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని అధైర్యపడొద్దని హామీ ఇచ్చారు.

**బీఆర్‌ఎస్‌లోకి భారీగా చేరికలు**

పాలకుర్తి బీఆర్‌ఎస్ కార్యాలయంలో శాతాపురం శివారు దుబ్బతండా ఎస్సీ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ భూక్యా యాకూబ్ నాయక్, రవి, యాదగిరి, భాస్కర్, అనిల్, వెంకటి, రవి, సీతారాములతో పాటు సుమారు 30మంది నాయకులు కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరగా, వీరికి ఎర్రబెల్లి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే పెద్దవంగర మండలం అవుతాపురం గ్రామానికి చెందిన యువకులు కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్‌ఎస్‌లోకి రావడంతో మాజీ మంత్రి దయాకర్‌రావు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు ఐలయ్య, సంజయ్, మాజీ జడ్పీ ఫ్లోర్‌లీడర్ శ్రీనివాస్, మండల పార్టీ మాజీ అధ్యక్షులు యాదగిరిరావు, సోమ నర్సింహరెడ్డి, దేవస్థాన మాజీ చైర్మన్ రామచంద్రయ్యశర్మ, నాయకులు సుధీర్‌కుమార్, రాము, రవి, బిక్షపతి, మండల యూత్ అధ్యక్షుడు హరీశ్‌యాదవ్ పాల్గొన్నారు. పాలకుర్తిలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పసునూరి నవీన్, ఎఫ్‌ఎస్‌సీఎస్ బ్యాంక్ చైర్మన్ బొబ్బల ఆశోక్‌రెడ్డి, తాజా మాజీ జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, కారుపోతుల వేణు, బానోతు రమేశ్, లకావత్ వెంకట్ నాయక్, నాగరాజు, బానోతు మహేందర్, కమ్మగాని వెంకటేశ్ పాల్గొన్నారు.

## కడియం ఊరవిష్కెలాంటోడు..

**మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి**

కాంగ్రెస్ పాలనలో పథకాల అమలులో ప్రజలకు అన్యాయం జరుగుతున్నదని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎలా గెలిచారో వాళ్లకే అర్థం కాక తర్జనభర్జన పడ్డారన్నారు. కనీసం కాంగ్రెస్ పార్టీలో సభ్యత్వం కూడా లేనివారు ఓవైపు.. మొదటినుంచీ కష్టపడి పనిచేసిన వారితో పార్టీలో సమన్వయం కొరవడిందని ఫలితంగా ప్రభుత్వం కుప్పకూలే పరిస్థితిలో ఉన్నదన్నారు. కడియం శ్రీహరి ఊరవిష్కెలాంటోడని.. పంట ఎక్కడ పచ్చగుంటే.. అక్కడే ఉండే రకమని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి పరిస్థితి చూస్తుంటే పూటకో మాట.. లంచ్‌కు ముందు ఓ మాట.. లంచ్ తర్వాత మరో మాట.. అలాగే మంత్రుల మాటలు సైతం పొంతన లేకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ రాష్ట్రానికి పెట్టుబడులతో ఇబ్బందులు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తే.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల సంక్షేమ పథకాలను గాలికి వదిలేసి పెండింగ్ బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతూ పాలన గాలికి వదిలి ఢిల్లీ, విదేశాల పర్యటనలు తప్ప రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. తొలి సీఎం కేసీఆర్ రైతు సంక్షేమమే లక్ష్యంగా తాగు, సాగునీటి కష్టాలు లేకుండా అందిస్తే.. ప్రతి ఆరు నెలలకు పంట పెట్టుబడి సహాయం అందిస్తే.. రేవంత్‌రెడ్డి మాత్రం ఇప్పటికీ ఏ ఒక్క రైతుకూ పూర్తిస్థాయిలో ఇవ్వని ఉన్నదని.. తేదీలను మార్చడమే తప్ప.. ప్రజలకు హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు.



పాలకుర్తి: మాజీ సర్పంచ్ యాకూబ్, కాంగ్రెస్ కార్యకర్తలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎర్రబెల్లి

# కేసీఆర్ వల్లే స్పోర్ట్స్ హబ్

- బీఆర్‌ఎస్ పాలనలో క్రీడలకు పెద్దపీట
- దేశంలోనే గొప్ప నాయకుడు కేసీఆర్
- శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్
- క్రీడాకారులను ప్రోత్సహించేందుకే కేసీఆర్ క్రికెట్ కప్
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్
- ఆర్ట్స్ కాలేజీలో టోర్నీ ప్రారంభం

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 12: తెలంగాణ తొలి సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ దేశంలోనే గొప్ప నాయకుడని, రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశారని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ అన్నారు. హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో కేసీఆర్ క్రికెట్ కప్ టోర్నీని బుధవారం బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బండా ప్రకాశ్ మాట్లాడుతూ స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత క్రీడలకు పెద్దపీట వేసి వరంగల్‌ను స్పోర్ట్స్ హబ్‌గా మార్చారని.. క్రీడాకారులకు ప్రోత్సాహకాలు, నగదు బహుమతులు, ఇంటి స్థలాలు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. గ్రామీణ స్థాయి నుంచి క్రీడలను బలోపేతం చేసేందుకు గత బీఆర్‌ఎస్ హ యాంలో క్రీడామైదానాలను సైతం ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. తెలంగాణ నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణిస్తూ పతకాలు సాధిస్తున్నారని, వారందరిని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. దాస్యం వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో కేసీఆర్ క్రికెట్ కప్ పోటీలను కొన్నేళ్లుగా నిర్వహించడం అభినందనీయమన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ క్రీడాకారులను ఈ పోటీల ద్వారా ప్రోత్సాహం అందించినట్లవుతుందని కొనియాడారు. తెలంగాణ ప్రజల 60 ఏళ్ల ఆకాంక్షను ఉద్యమనేత, తొలి సీఎం కేసీఆర్ నెరవేర్చారని, వారి జన్మదినాన్ని పురస్కరించుకుని పశ్చిమ నియోజకవర్గ పరిధిలో క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామని దాస్యం తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఏటా పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఓరుగల్లు క్రికెట్ క్రీడాకారులను ప్రపంచానికి పరిచయం చేసేందుకు కాకతీయ క్రికెట్ అకాడమీతో కలిసి కేసీఆర్ క్రికెట్ కప్ నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. బీఆర్‌ఎస్ పాలనలో క్రీడలకు, క్రీడాకారులకు ప్రాధాన్యమిచ్చామన్నారు. కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్, బోయినపల్లి రంజిత్‌రావు, నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పులి రజినీకాంత్ పాల్గొన్నారు.



బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్

















